# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 229 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 26 నవంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# ప్రజల సమస్యలు ఎజెండాగా చర్చించాలి



- కొత్త ఏడాదిలోకి అడుగిడుతున్న తరుణం
- మనమంతా కలసికట్టుగా ముందుకు సాగాలి
- రాజ్యాంగం ఆవిర్భవించి నేటికి 75 ఏళ్లు
- సంవిధాన్ సదన్‌లో నేడు రాజ్యాంగ దినోత్సవం
- పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, నవంబర్ 25 (ప్రభాత ఉదయం):** ప్రజలతో తిరస్కరణకు గురైన వారు పార్లమెంట్‌ను నియత్రించే పనిలో ఉన్నారని ప్రధాని మోడీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలపై చర్చకు అంతా సిద్దంగా ఉండాలని, ప్రభుత్వం అందుకు సంసిద్దంగా ఉందన్నారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు.ప్రస్తుతం మనం 2024ను పూర్తి చేసుకోబోతున్నాం అని అన్నారు. పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ.. పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' అని ప్రధాని అన్నారు. 2025 కోసం దేశం సిద్ధమవుతోంది. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందాం అని మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రజల చేత తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు.. కొందరి చేత గూండాయిజం చేయించి, పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను దేశ ప్రజలంతా చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారు చూస్తూ ఊరుకోరు. అయితే ఇక్కడ

..మిగతా 2లో



# స్కిల్ వర్సిటీ విరాళం వందకోట్లు వెనక్కి

### అదానీ డబ్బులు తీసుకోరాదని నిర్ణయం
### ఢిల్లీకి ఎన్నిమార్లయినా వెళుతూనే ఉంటాం
### కేటీఆర్ జైలుకెళ్లడానికి తహతహలాడుతున్నారని ఎద్దేవా
### విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ ప్రకటన

**హైదరాబాద్, నవంబర్ 25 (ప్రభాత ఉదయం):** అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు. ప్రముఖ

..మిగతా 2లో



## మహారాష్ట్ర సీఎం పీఠంపై
# వీడని ఉత్కంఠ

**ముంబై, నవంబర్ 25 (ప్రభాత ఉదయం):** 'మహాయుతి' కూటమి 236 సీట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సీఎం సీటుకు సంబంధించి ఏదైనా ఫార్ములాపై చర్చ జరుగుతోందా అనే విషయంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సోమవారం స్పందించారు. అలాంటి ఫార్ములా ఏదీ చర్చకు రాలేదని ఆయన చెప్పారు. మహాయుతి ప్రభుత్వానికి పట్టం

..మిగతా 2లో

# 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి?

### అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించే ప్లాన్!
### ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..?
### అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలి
### మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్

**హైదరాబాద్, నవంబర్ 25 (ప్రభాత ఉదయం):** సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పై మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు స్పందించారు.స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు

..మిగతా 2లో





# తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత


### ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పెరిగిన చలి తీవ్రత
### పలుచోట్ల 10 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు

**హైదరాబాద్, నవంబర్ 25 (ప్రభాత ఉదయం):** తెలంగాణ చలి తీవ్రత బాగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదు అవుతున్నట్లు తెలుస్తోంది. ఏపీలో వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని అంటున్నారు. హైదరాబాద్‌లో కూడా చలి పిడుగు

..మిగతా 2లో

## రాజ్యాంగ ప్రవేశికపై
# సుప్రీం కీలక తీర్పు

### ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలగింపు పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, నవంబర్ 25 (ప్రభాత ఉదయం):** రాజ్యాంగ ప్రవేశిక అంశంపై సోమవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలగించాలని దాఖలైన పిటిషన్లను తాజాగా కొట్టివేసింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో

..మిగతా 2లో

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

### మహారాష్ట్రలో తగిన బుద్ధి చెప్పారు
### రాళ్లలో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారు
### బీఆర్ఎస్ మీదే కేసులా... కాంగ్రెస్ మీద కేసులుండవా.?
### మహబూబాబాద్ మహాధర్నాలో మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

**మహబూబాబాద్, నవంబర్ 25 (ప్రభాత ఉదయం):** అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు

..మిగతా 2లో



ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# స్కిల్ వర్సిటీ విరాళం వందకోట్లు వెనక్కి

**మొదటి పేజీ తరువాయి...**

పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. అయితే ఆదానీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వందకోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరఫున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అదానీ అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం.. నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగ వద్దని ఈ సందర్భంగా ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతు న్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని కేటీఆర్ భావిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జైలుకెళ్లినవాళ్లు సీఎం అయ్యేదుంటే.. ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. తన తాజా ఢిల్లీ టూర్ పర్యటనపై సైతం సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఈ ఢిల్లీ పర్యటన అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఢిల్లీ పర్యటనతో రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాలపై మంగళవారం పార్టీ ఎంపీలతో చర్చిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులను కలిసి.. రాష్ట్ర సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు.అయితే తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీలా పైరవీలు చేయడానికి.. బెయిల్ కోసం తాను ఢిల్లీ వెళ్లడం లేదని బీఆర్ఎస్ అగ్రనేతలను పరోక్షంగా విమర్శించారు. కానీ కేంద్రాన్ని కలిసి మనకు రావాల్సినవి రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవసరమైతే ఎన్నిసార్లు అయినా.. ఢిల్లీ వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అదానీకి ఎన్నో ప్రాజెక్టులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. అదానీ సంస్థపై లంచాల విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై విధంగా స్పందించారు. అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది. అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్‌నకు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు' అని సీఎం అన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

**మొదటి పేజీ తరువాయి...**



ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

### తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబితే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు.

### ఫార్మా విలేజ్ ఎవరి కోసం.....

ఫార్మా విలేజ్ ఎవరి కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదని విమర్శించారు. మరో 10 రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది అవుతుందని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 420 హామీలు ఇచ్చారా? ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడున్న డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ు

# రాజ్యాంగ ప్రవేశికపై సుప్రీం కీలక తీర్పు

**మొదటి పేజీ తరువాయి...**

సామ్యవాద, లౌకిక అనే పదాలను జోడిస్తూ 1976లో చేసిన 42వ సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పదాలను తొలగించాలని కోరుతూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు ఈ పిటిషన్లు వేశారు. ఆ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదని వారు వాదించారు. ఎమర్జెన్సీ (1975-77) సమయంలో చేసిన ఈ సవరణల చట్టబద్ధతను వారు ప్రశ్నించారు. ఈ పిటిషన్లపై పలు వాదనలు విన్న సుప్రీంకోర్టు నవంబర్ 22న తీర్పు రిజర్వ్ చేసి, తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేసింది. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని గత విచారణల్లో సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 'సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే' అని పేర్కొంది.

# ప్రజల సమస్యలు ఎజెండాగా చర్చించాలి

**మొదటి పేజీ తరువాయి...**

బాధించే విషయం ఏంటంటే.. పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా పార్లమెంట్‌కు ఎన్నికైన వారు కొత్త ఆలోచనలతో వస్తుంటారు. కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించరు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు. ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకుతీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నానని మోదీ అన్నారు. దేశం 2025ని పూర్తి ఉత్సాహంతో, ఉత్సాహంతో స్వాగతించేందుకు సిద్ధమవుతోంది. ఈ పార్లమెంటు సమావేశాలు అనేక విధాలుగా ప్రత్యేకమైనవి. ఇప్పుడు అతిపెద్ద విషయం ఏమిటంటే, మన రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణం, 75వ సంవత్సరంలోకి ప్రవేశించడం ప్రజాస్వామ్యానికి మంచి అవకాశమని గుర్తు చేశారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించడానికి రేపు అందరూ రాజ్యాంగ పరిషత్‌లో కలిసి రావాలని ప్రధాని కోరారు. మహారాష్ట్ర, యూపీలో బంపర్ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి పార్లమెంట్ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. శీతాకాల సమావేశాలు కావడంతో వాతావరణం చల్లగా ఉంటుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. విపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని మోదీ, కొద్దిమంది వ్యక్తులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రస్తావించారు. ఆ వ్యక్తులు తమ బాధ్యతలను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ గూండాయిజంతో పార్లమెంట్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని ప్రధాని మోదీ అన్నారు. వారు పార్లమెంటులో చర్చకు అనుమతించరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆపడమే వారి సొంత లక్ష్యమని ఎద్దేవా చేశారు ప్రధాని మోదీ. కానీ దేశ ప్రజలు వారి ప్రవర్తనను పట్టించుకోరని, సమయం వచ్చినప్పుడు ప్రజలు వారిని శిక్షిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పార్లమెంటులో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని సూచించారు. సాంప్రదాయం ప్రకారం సమావేశాల మొదటి రోజు, ప్రధాని మోదీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రసంగించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు, లోక్‌సభ, రాజ్యసభల 19-9 సమావేశాలు జరుగుతాయి. వక్ఫ్ (సవరణ) బిల్లుతో సహా 16 బిల్లుల జాబితాను ప్రభుత్వం సెషన్‌లో పరిశీలనకు సిద్ధం చేసింది. లోక్‌సభలో ఎనిమిది, రాజ్యసభలో రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం పలు ముఖ్యమైన బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు ప్రయత్నిస్తుంది. గత సెషన్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్యాంకింగ్ నిబంధనల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు ఇందులో ఉన్నాయి. కానీ వాటిని పాస్ చేయలేకపోయారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందిన ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. అనేక ముఖ్యమైన బిల్లులపై కాంగ్రెస్‌తో సహా పలు ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు గందరగోళంగా మారే ఛాన్స్ ఉంది.

# 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి?

**మొదటి పేజీ తరువాయి...**

అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని , ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ ప్రకటించిన 100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడుతామనే ప్రతిపాదనతో వస్తే, మర్యాదపూర్వకంగా కలిసి చాయ్ తాగించి పంపించేశామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని తెలిపారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



# కేసీఆర్ పాలనలోనే బీసీలకు న్యాయం

## కులగణనకు చట్టబద్ధత ఉందా..?: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, నవంబర్ 25 (ప్రభాత ఉదయం): కులగణనకు చట్టబద్ధత ఉందోలేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి డెడికేటెడ్ కులగణన కమిషన్‌కు 35 పేజీలతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం బీసీలకు ఎంతో న్యాయం చేసిందన్నారు. కులగణకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కులగణన చేపట్టబోమని బీజేపీ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ ద్వంద వైఖరిని బీసీలు ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# మహారాష్ట్ర సీఎం పీఠంపై వీడని ఉత్కంఠ

**మొదటి పేజీ తరువాయి...**

కదుతూ ప్రజలు చాలా గట్టి తీర్పునిచ్చారని, అసెంబ్లీ విపక్ష నేత పదవికి అవసరమైన సంఖ్యాబలం కూడా 'మహా వికాస్ అఘాడి'కి రాలేదని చెప్పారు. "ఏ ఫార్ములాపై చర్చ జరగడం లేదు. మేము ముగ్గురూ (కూటమి) కలిసి సీఎం పదవిపై చర్చిస్తాం. అసెంబ్లీలో ఎన్‌సీపీ నేతగా నన్ను ఎన్నుకున్నారు. శివసేన తరఫున ఏక్‌నాథ్ షిండే ఎన్నికయ్యారు. బీజేపీ కూడా ఇదే చేసింది. మేము కలిసి చర్చించుకుని సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం" అని అజిత్ పవార్ తెలిపారు. సీఎం రేసులో బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముందంజలో ఉన్నారు. బీజేపీ పోటీ చేసిన 149 స్థానాల్లో 132 స్థానాలను ఆ పార్టీ గెలుచుకోవడంతో ఫడ్నవిస్‌కు మూడోసారి సీఎం పగ్గాలు అప్పగిస్తారనే వాదన బలంగా ఉంది. మరోవైపు సీఎం రేసులో ఏక్‌నాథ్ షిండే ఉన్నారని ఆ పార్టీ నేత సంజయ్ షిరసత్ తెలిపారు. సీఎం ఎవరనేది అంతిమంగా ఢిల్లీలో నిర్ణయిస్తారని, చర్చలు జరుగుతున్నందున ఫలితం ఏమిటనేది వేచిచూడాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నందున దానిని కూడా సీఎం ఎంపిక విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మంగళవారానికి ఒక స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

### ఢిల్లీలో కీలక సమావేశం

సీఎం పీఠంపై తలెత్తిన ప్రతిష్ఠంభనను తొలగించేందుకు ఢిల్లీలో సోమవారం 'మహాయుతి' అగ్రనేతలతో సమావేశం ఏర్పాటైంది. హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం హాజరవుతున్నారు. సమావేశానంతరం కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

# తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత

**మొదటి పేజీ తరువాయి...**

భయపెడుతోంది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు రెండూ దారుణంగా పడిపోయాయి. రాత్రి చలి వణికిస్తుంటే ఉదయం పొగమంచు మరింత భయపెడుతోంది. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. చలి, పొగమంచు కారణంగా కాలుష్య తీవ్రత కూడా హైదరాబాద్‌లో విపరీతంగా పెరిగిపోయింది. కాగా తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షావరణం ఉంటే తెలంగాణలో మాత్రం ఎముకలు కొరికే చలి ఇబ్బంది పెడుతోంది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం చలి తీవ్రత పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారనుంది. అనంతరం ఇది వాయవ్య దిశగా కదులుతుంది. తమిళనాడు శ్రీలంక తీరం వైపునకు వెళ్లి అక్కడ మరింత బలపడబోతోంది. ప్రస్తుత అల్పపీడన ప్రభావం కొంత వరకు కోస్తా ఆంధ్రపై కనిపిస్తోంది. ఆకాశం మబ్బులు పట్టి ఉంది. ఇది వాయుగుండంగా మారితే బుధవారం నుంచి శనివారం వరకు వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. శ్రీలంక సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్న అల్పపీడనం దక్షిణ కోస్తాపై ప్రభావం చూపబోతోంది. ఈ సాయంత్రం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. దక్షిణ కోస్తాతోపాటు రాయల సీమపై కూడా ప్రభావం ఉంటుంది. వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉంది. వర్షాలతోపాటు బలమైన గాలులు కూడా వీస్తాయి. దీంతో చలి తీవ్రత మరింతగా పెరగొచ్చు. సముద్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు కారణంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. నాలుగు రోజుల పాటు సముద్రంపై అల్పపీడన ప్రభావం తీవ్రంగా ఉంటుందని అందుకే జాగ్రత్తగా ఉండాలని చెబుతు న్నారు. రైతులు కూడా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

# కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాలకు రూ.4కోట్ల విరాళాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చిన దొడ్ల డైరీ సంస్థ

బుద్వేల్, నవంబరు25 (ప్రభాత ఉదయం) పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాల అభివృద్ధికి దొడ్ల డైరీ రూ. 4కోట్ల విరాళాన్ని ప్రకటించింది. దీనికి సంబందించిన దొడ్ల డైరీ బోర్డు ఆమోద పత్రాన్ని సంస్థ సీఈఓ బీవీకే రెడ్డి విశ్వవిద్యాలయం ఉపకులపతి, పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సబ్యాసాచి ఘోష్ కు సోమవారం సచివాలయంలోని ఆయన చాంబర్ లో అందజేశారు. ఈ విరాళం ద్వారా కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాల భవన మొదటి అంతస్తు నిర్మాణం, ఎన్ హెచ్ 44 నుంచి కళాశాల వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం, కళాశాల నుంచి బాలుర వసతి గృహం. బాలికల వసతి గృహం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం, కళాశాల భవనానికి మరమ్మత్తులు, రం గులు వెయ్యడం, కళాశాల ప్రాంగణంలో సుందరీకరణ, మిని డైరీ ప్లాంట్ ఏర్పాటు, ఇతర అవసరమైన పరికరాలను ఏర్పాటు చేస్తామని జీవీకే రెడ్డి తెలిపారు. ఈ పనులకు సంబందించిన వివరాలను తెప్పించుకుని కావాలిన విశ్వవిద్యాలయం ఆమోదాన్ని ఇవ్వవలసిందిగా ఉప కులపతి సబ్యాసాచి ఘోష్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర ను ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన దొడ్డ డైరీ యాజమాన్యం, చైర్మన్ సునిల్ రెడ్డి, సీఈఓ బీకేవీ రెడ్డి లను అభినందిస్తు దన్యవాదాలు తెలిపారు. ఈ వసతుల కల్పనతో రాబోయే కాలంలో కళాశాలలో ఎంటెక్ కోర్సును ప్రారంభించే అవకాశం ఉటుందన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడి విద్యార్థుల నైపుణ్యం కూడా పెరుగుతుందని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర తెలిపారు.



పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ సభ్యసాచి ఘోష్ కు రూ.4 కోట్ల విరాళానికి సంబంధించిన ఆమోద పత్రాన్ని అందజేస్తున్న దొడ్ల డైరీ సిఈఓ బీవీకే రెడ్డి




డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్‌కు వినతి పత్రం అందచేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

## డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్

బుద్వేల్, నవంబరు25(ప్రభాత ఉదయం):మైలార్దేవుపల్లి డివిజన్ దుర్గానగర్ చౌరస్తా నుంచి దుర్గా కన్వెన్షన్ మీదుగా దాని ముందు ఉన్న కాలనీ గూండా వెళ్తున్న నాలా కు పై కప్పు నిర్మిం చాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు ఎస్.వెంకటేశ్ కోరారు. ఇదే విషయమై సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం లో జరిగిన ప్రజా వాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు అక్కెం రాఘవేందర్ యాదవ్, బండ రాజేశ్ యాదవ్లతో కలసి రూ.10 కోట్లతో దుర్గానగర్ కాలనీ గూండా దాని ముందున్న బస్తీకి నిర్మిస్తున్న బాక్స్ టైప్ డ్రైయిన్ను పరిశీలించారు. దుర్గానగర్ కాలనీలో నిర్మిస్తున్నట్లుగానే దుర్గా కన్వెన్షన్ ముందున్న బస్తీ లో కూడా ఓపెన్ నాలా కాకుండ బాక్స్ టైప్ డ్రైయిన్ ను నిర్మించాలన్నారు. బాక్స్ టైప్ డ్రైయిన్ తో పాటు దుర్గా కన్వెన్షన్ ముం దున్న బస్తీకి రహదారిని వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.రాము యాదవ్, అరుణ్ ముదిరాజ్, మైసిరెడ్డి, రాజు, సురేశ్ ముదిరాజ్, ఎల్.రాజు అశోక్ కుమార్, నవీన్, రాయుడు, కిషి తదితరులు పాల్గొన్నారు.



## నేడు కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లిలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం


రాజేంద్రనగర్, నవంబరు 25(ప్రభాత ఉదయం) కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని మైలార్ దేవుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దుర్గా నగర్, దుర్గా హిల్స్, టీఎన్జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి ఆలయం, మైలార్దేవ్పల్లి కల్లు కాంపౌండ్, గణేష్ నగర్, స్వప్న టాకీస్, లక్ష్మిగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడున్నర గంటలవరకు లక్ష్మి గూడ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆర్ జీకే, వాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరయం ఉ ంటుందని కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. మైలార్ దేవుపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన బృందావన్ కాలనీ ప్రగతి కాలనీ మోడల్స్ కాలనీ మైలార్దేవ్పల్లి పాత గ్రామం రామకృష్ణ హిల్స్ వినాయక నగర్ ప్రాంతాలలో ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు అబ్దుల్లా కాలనీ, పల్లె చెరువు, బండ్లగూడ, ఐడిఏ ఎండి పల్లి, రెహమత్ కాలనీ, జహంగీరాబాద్, రీగల్ గార్డెన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన అలీనగర్, అయిషా కాలనీ, అహ్మద్నగర్, ప్యాలెస్ వ్యూ కాలనీ కింగ్స్ అవెన్యూ, ఆశమాబాద్, దస్తగిరి నగర్, పటేల్ నగర్, రహమత్ కాలనీ, సుబహాన్ కాలని, జహంగీరాబాద్, వాదే ఈ పహరాన్, సుభాన్ కాలనీ ఫేస్ -1,2, ప్రాంతాలలో ఇది సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



జిల్లా కలెక్టర్ సంతోష్ కు తన సమస్యను వివరిస్తున్న బాధితుడు

## ప్రజావాణికి 45 ఫిర్యాదులు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబరు25(ప్రభాత ఉదయం): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



డాక్టర్ సుల్తాన్ అమరేందర్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వై శ్రీధర్, పీ. శ్రీనివాసులు నాయి తదితరులు

## డాక్టర్ సుల్తాన్ అమరేందర్ దంపతులకు 25 సంవత్సరాల వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

బుద్వేల్, నవంబరు25(ప్రభాత ఉదయం): రామయ్య క్లినిక్ అధినేత రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సుల్తాన్ అమరేందర్-డాక్టర్ ఉషా రాణి వివాహ వార్షికోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం రాజేంద్రనగర్ మానసా హిల్స్ లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్. నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాస్ నాయి , బీజేపీ ఎస్సీ సెల్ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రవీందర్, రాజేంద్రనగర్ సర్కిల్ టీడీపీ అధ్యక్షుడు ఎన్ వెంకటేష్. బీజేపీ నాయకులు రమణ పాల్గొని సన్మానం చేయడం జరిగింది

## డిసెంబరు 3న పాస్టరమ్మల క్రిస్మస్ వేడుకలు

బుద్వేల్, నవంబరు25(ప్రభాత ఉదయం): డిసెంబరు 3వ తేదీన ఉదయం 10 గంటలకు గండిపేట్ మండలం హైదర్శాకోట్ హిమగిరి నగర్‌లో గల పెనుయేల్ గాస్పెల్ చర్చిలో రాజేంద్రనగర్ పాస్టరమ్మ ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నారు. పాస్టరమ్మ ల ఫెలోషిప్ అధ్యక్షురాలు పాస్టర్ పి అనురాధ స్వర్ణకుమార్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ఎన్ స్వర్ణ రాజారామ్ ల ఆద్వర్యంలో ఈ వేడుకలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా పాస్టరమ్మ ల క్రిస్మస్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న పెనుయేల్ గాస్పెల్ చర్చి పాస్టర్ రోజా గుమ్మళ్ళ బైబిల్ సందేశాలను అందజేయనున్నారు. క్రిస్మస్ క్యారెల్స్, స్తుతి ఆరాధనలు, సాక్షాలు, శుభాకాంక్షలు, శక్తి వంతమైన బైబిల్ సందేశాలు, కానుకలు ఉంటాయని పాస్టర్ పి అనురాధ స్వర్ణ కుమార్, ఎన్. స్వర్ణ రాజారామ్ లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సేవ చేస్తున్న పాస్టరమ్మ లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



పాస్టర్ రోజా గుమ్మళ్ళ

## చంద్రమౌళీశ్వర స్వామీ వారికి అలంకరణ

బుద్వేల్, నవంబరు 25 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ హరిహర క్షేత్రంలో కార్తీకమాసం చివరి సోమవారం రోజున శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకలు, స్వామి వారికి అన్నాభిషేకం (అన్నలంకరణ) చేయడం జరిగింది. ఈ యొక్క కార్తీక మాసంలో ఆలయ ప్రధాన అర్చకులు అనంతగిరి అనంత చార్య పర్యవేక్షణలో కార్తీక పౌర్ణమి ప్రతి సోమవారం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ప్రతిరోజు ఆకాశ దీపారాధన ఇతర కార్యక్రమాలు భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించడం జరిగింది.



స్వామీ వారికి అలంకరణ



జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ సాయి లక్ష్మీకి వినతి పత్రం అందచేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

## దుర్గా కన్వెన్షన్ ముందు బస్తీకి త్రాగునీటి సౌకర్యం కల్పించాలి

బుద్వేల్, నవంబరు25(ప్రభాత ఉదయం) : దుర్గా కన్వెన్షన్ ముందు గల బస్తీలో 20 సం వత్సరాలుగా 150 కుటుంబాలు నివాసం ఉంటున్నారని, వారికి నేటికి త్రాగడానికి మంచినీరు లేదని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు ఎస్. వెంకటేశ్, యువ నాయకుడు అక్కెం రాఘవేం దర్ యాదవ్లు అన్నారు. ఆ బస్తీకి త్రాగునీటి పైపు లైన్ వేసి మంచినీటి వసతి కల్పించాలని కోరుతు రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ సాయి లక్ష్మికి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, మైలార్ దేవుపల్లి బస్తీలో అం తర్భాగమైన బస్తీకి 20 సంవత్సరాలుగా త్రాగునీటి సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. అధికారులు సర్వే చేసి దుర్గా కన్వెన్షన్ ముందు భాగంలో ఉన్న బస్తీకి మంచినీటి సౌకర్యం కల్పిం చాలన్నారు. జలమండలి అధికారులను కలసిన వారిలో ఎన్.రాము యాదవ్. అరుణ్ ముదిరాజ్, మైసిరెడ్డి, రాజు, సురేశ్ ముదిరాజ్. ఎల్. రాజు అశోక్ కుమార్, నవీన్, రాయుడు, రిషి తదితరులు ఉన్నారు.



శివాలయం వద్ద లీకేజీ

## శివాలయం వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ

బుద్వేల్, నవంబరు25(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ శివాలయం వద్ద మిషన్ భగీరథ ఫైప్ లైన్ పగిలింది. సోమవారం ఉదయం నుంచి మంచినీరు వృదాగా రోడ్డుపై పారింది. మంచినీరు వృదాగా పోతున్న రాజేంద్రనగర్ జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే శివాలయం వద్ద ఏర్పడ్డ మం. చినీటి లీకేజీని బాగు చేయాలని స్థానికులు కోరారు.

# పశువుల సంతలో సిబ్బంది చేతి వాటం

**అడ్డగోలుగా మార్కెట్ రుసుము వసూళ్లు**

**ఆన్ లైన్ ట్యాబ్ మిషన్ ఉన్న... పని చేస్తలేదంటూ బుకాయింపు**



గద్వాలలోని పశువుల సంత

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 25 (ప్రభాత ఉదయం) కొన్ని దశాబ్దాలుగా గద్వాల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పశువుల సంతలో పెద్ద ఎత్తున్న మేకలు, గొర్రెలు,ఎద్దులు, ఆవులు క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. వివాహాది శుభకార్యాలకు మేకలు, గొర్రెలు, గొర్రె పొట్టేళ్లను సంతలో చౌకధరలకు పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తారు. గ్రామాలల్లో మాంసం విక్రయించేవారు పెద్ద సంఖ్యలో మేకలు, గొర్రెలను కొనుగోలు చేస్తారు. గద్వాల జిల్లాతో పాటు ఆత్మకూరు, మక్తల్,రాయచూరు, పెబ్బేర్ తదిత ప్రాంతాల నుండి మేకలు, గొర్రెలు, బర్రెలు, ఎద్దులను తీసుకువచ్చి క్రయ విక్రయాలు చేస్తుంటారు. అత్యధికంగా గొర్రెలు, మేకలు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. గతంలో పసువుల సంత ద్వారా మార్కెట్ కు 20,000 రూపాయల వరకు ఆదాయం వస్తుందని అంచనా. మార్కెట్ యార్డు ఆదాయం పెంచుకోవడానికి పాలకులు ఆన్ లైన్ మిషన్ ద్వారా కొనుగోలుదారులకు రిషిప్టు అందజేసి మార్కెట్ రుసుము కిందా డబ్బులు వసూళ్లు చేస్తోంది. కాని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూటికి ఒక్క రూపాయి చొప్పున కొనుగోలు చేసిన ఆవు, మేక, ఎద్దు, గేదెలకు వసూలు చేయాలి. అనగా ఐదువేలకు మేకను కొనుగోలు చేస్తే 50 రూపాయలు మార్కెట్ రుసుము ఆన్ లైన్ నమోదు చేసుకొని రిషిప్టు పొందాల్సి ఉంటుంది. ఇలా మేకలను, గొర్రెలను కొనుగోలుదారులకు వ్యవసాయ మార్కెట్ సిబ్బంది ఆన్ లైన్ రిషిప్టు అందజేసి వారి నుంచి నగదు తీసుకోవలసి ఉంటుంది. కాని నిబంధనలకు విరుద్ధంగా పశువుల సంతలో పని చేసే సిబ్బంది కొనుగోలు దారులను నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రతి మేక, గొర్రెలను కొనుగోలు చేసిన వారి నుంచి రూ.100 -150 వసూళ్లు చేస్తున్నారు. కాని ఆన్ లైన్ ట్యాబ్‌లో కొనుగోలుదారుడి పూర్తి సమాచారం లేకుండా రూ.50 కట్ చేసి వసూళ్లు చేసిన డబ్బులను తమ జేబులు నింపుకుంటున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు.



ఆన్ లైన్ ద్వారా మార్కెట్ రుసుము వసుళ్లు చేస్తున్న సిబ్బంది

దరూర్ మండాలనికి చెందిన ఓ వ్యక్తి గద్వాల పశువుల సంతలో రూ.10వేలు విలువ చేసే పొట్టేలును కొనగోలు చేయగా మార్కెట్ సిబ్బంది మార్కెట్ రుసుము కిందా ఆ వ్యక్తి నుంచి రూ.100 వసూళ్లు చేశారు కాని ఎలాంటి రిసిష్ట్ ఇవ్వలేదని ఆరోపించారు. ఇది ఇలా ఉంటే సంతలో మార్కెట్ సిబ్బందితో పాటు ప్రైవేటు వ్యక్తులు గొర్రెలు,మేకలు కొన్న వారి నుంచి ఎలాంటి రిషిప్టు ఇవ్వకుండా మార్కెట్ రుసుము వసూళ్లు చేస్తుండటం గమన్హారం. సంతలో ఎంత వసూలు చేస్తున్నారు? నిబంధనలకు లోబడి వసూలు చేస్తున్నారా లేదా పర్యవేక్షించాల్సిన అధికారులు తమ బాధ్యత మరచి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ తతంగం చూస్తుంటే మార్కెట్ యార్డుకు రావలసిన ఆదాయాని సిబ్బంది కాజేస్తున్నట్లు అనుమానాలు బలంగా వినిపిస్తాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై గద్వాల మార్కెట్ యార్డు సెక్రటరీ నరసింహ్మాను వివరణ కోరగా మా దృష్టికి రాలేదని, ఎవరైనా అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.




నగర మేయర్ విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేస్తున్న మల్కాజిగిరి కార్పొరేటర్లు

# మల్కాజ్గిరి నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదు

**నగర మేయర్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేసిన కార్పొరేటర్లు**

మల్కాజిగిరి, నవంబర్ 25(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి నియోజకవర్గం లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని స్థానిక కార్పొరేటర్లు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కలిసి ఫిర్యాదు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ని తన కార్యాలయంలో కలిసిన మల్కాజిగిరి నియోజకవర్గ కార్పొరేటర్లు, ప్రోటోకాల్ ఉల్లంఘన, అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాల పై మేయర్ ను కలిశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ప్రారంభోత్సవం, అధికారులు ప్రోటోకాల్ కు విరుద్ధంగా జరిపిస్తున్నారని, స్థానిక బి.ఆర్.ఎస్ కార్పొరేటర్ల కు తమ డివిజన్లలో ప్రాధాన్యత ఇవ్వకుండా, అధికార పార్టీ నాయకుకు చెబితేనే పనులు జరుగుతున్నాయని, స్థానిక ఎమ్మెల్యే కు కూడా తెలియజేయకుండా పనులు మొదలుపెడుతున్నారని, అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో అధికారులు పనిచేస్తున్నారు. అధికారులు బాహాటంగానే రాజకీయ ఒత్తిడి ఉందని పబ్లిగ్గా ఒప్పుకుంటున్నారని, సదరు అధికారుల పై శాఖాపరమైన, క్రమశిక్షణ చర్యలు తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం సెక్షన్ 153 - 154 - 155 ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పిస్తూ... ప్రోటోకాల్ ఉల్లంఘనకు సంబంధించిన ఆధారాలు అనగా పత్రికలలో వచ్చిన వార్తలను కూడా అందించడం జరిగింది. మేయర్ ను కలిసిన వారిలో అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, వెంకటాపురం కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ రెడ్డి , నెరెడ్ మేట్ డివిజన్ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు.

# ప్రజల కోసం ఫలించిన అరుణమ్మ పోరాటం

**పరువు నిలుపుకోవడానికి ఇతర పార్టీల ద్వారా రేవంత్ ఆరాటం**

**బీజేపీ నాయకుడు బొక్క బాల్ రెడ్డి**



పాలమూరు ఎంపీ డీకే అరుణతో గద్వాల జిల్లా పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి

మహబూబ్ నగర్, నవంబర్ 25(ప్రభాత ఉదయం) గత కొద్ది రోజులుగా లగచర్ల రైతుల పట్ల నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై పోరాటం చేసిన మహబూబ్ నగర్ ఎంపీ,బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణమ్మ ప్రభుత్వం మెడలు వంచి రైతులకి న్యాయం చేయడం సంతోషకరం అని బీజేపీ నాయకుడు బొక్క బాల్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ సొంత లాభం కోసం లగచర్ల లో రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా ఫార్మా సిటీ పేరుతో భూసేకరణ చేప్పట్టి,అక్కడ తీవ్ర భయోత్పాతం సృష్టించి,రైతులని జైలు కి కూడా పంపిందని గుర్తు చేశారు . ఇది తెలుసుకున్న పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ రైతులకి అండగా నిలబడి,సొంత పార్లమెంట్ సెగ్మెంట్ లో ఉన్న ఊరిలోకి వెళ్తుంటే పక్క జిల్లా సరిహద్దులో కాన్వాయ్ ఆపి,ఎటువంటి నేరం చేయకపోయినా 151 పేరుతో ముందస్తు అరెస్ట్ చేసిన బెదిరిపోకుండా నిలబడి కొట్లాడారు అని కొనియాడారు. అలానే మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ,బీజెపి అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ,అరుణమ్మ తో కలిసి పోరాడి,ఈ విషయం జాతీయ మానవహక్కుల సంఘం కి పిర్యాదు చేసి,విచారణ కూడా మొదలు పెట్టించారన్నారు. బీజేపీ నాయకుల కృషి ఫలితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో చలనం వచ్చి,తాము అక్కడ భూసేకరణ ఫార్మా సిటీ కోసం కాదని,ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అని ప్రకటించడం రైతుల పక్షాన పోరాడిన అరుణమ్మ,బీజేపీ నాయకుల తొలి విజయం అన్నారు. అరుణమ్మ అంటే సూర్య కాంతి అని,ఆమె ముందు దివిటీలు వెలిగించాలని చూడడం మూరత్వం అని తాను ఇంతకుముందు చెప్పిన విషయం గుర్తు చేశారు . ముఖ్యమంత్రి దీని నుంచి ఎలా బయటపడాలో తెలియక,వామపక్ష నేతలతో ఏదో కథ నడిపించాలని చూసినా ఈ పోరాట విజయం,అరుణమ్మ,బీజేపీ నాయకులది అని ప్రజలు ఇప్పటికే గ్రహించారు అన్నారు . వారు ఇచ్చిన స్ఫూర్తితో తెలంగాణ లో బీజేపీ కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై పోరాడాలి అని కోరారు. ప్రభుత్వం అరుణమ్మ కోరినట్టుగా రైతులపై కేసు లు బేషరుతుగా ఉపసంహరించాలని బొక్క బాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# కోటిలింగేశ్వరస్వామివారిని దర్శించుకొన్న వనపర్తి శాసనసభ్యులు మేఘరెడ్డి

కొత్తకోట, నవంబర్ 25(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో శ్రీకోటిలింగేశ్వర స్వామి వారిని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఎమ్మెల్యే మెగా రెడ్డికి స్వాగతం పలికి ఆలయ కమిటి శాలువాతో సన్మానం చేశారు. మొదట మేఘరెడ్డి నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో మేఘరెడ్డి సహకారంతో ప్రతిష్టించిన పంచలోహ శివలింగాన్ని దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోటిలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



# పీజీ సెంటర్‌ను సందర్శించిన వీసీ శ్రీనివాస్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 25(ప్రభాత ఉదయం) గద్వాల పీజీ సెంటర్ ను పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.ఎం .శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థులతో వివిధ అంశాలపై చర్చించారు, కళాశాల హాస్టల్ కు సంబంధించిన భవనాలను కూడ పరిశీలించి పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని ,పరిశుభ్రంగా నిర్వహించాలని నిర్వాహకులకు తెలియజేశారు .కళాశాల నూతన భవనాన్ని సందర్శించి , పనుల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓ ఎస్ డి డాక్టర్ మధుసూదన్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ చవ్వా వెంకట్ రెడ్డి ,యూనివర్సిటీ ఇంజనీర్ శ్రీనివాస్ , అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికీ జైలు శిక్ష

కొత్తకోట, నవంబర్ 25(ప్రభాత ఉదయం ఉదయం)కొత్తకోట మండలం పాలెం చౌరస్తాలో ఆదివారం నిర్వహించిన పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో ఇద్దరికి జైలు శిక్ష పడిందని ఎస్సై మంజునాథ రెడ్డి చెప్పారు. మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న జి రాములు %ం%% నాగన్న(35) కానాయపల్లి, బి ఆంజనేయులు %ం%% రామస్వామి (42) షేర్ పల్లి పెబ్బేరు మండలం ఇద్దరు వ్యక్తులను వనపర్తి కోర్ట్ లో హాజరుపరచగా వనపర్తి సెకండ్ అడిషనల్ జె ఎఫ్ సి ఎం, ఇంచార్జ్ ఆత్మకూర్ జె ఎఫ్ సి ఎం జడ్జి శ్రీమతి జానకి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే 20 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఫైన్ వేయడం జరిగినది అన్నారు. ట్రాఫిక్ రూల్స్ కు విరుద్ధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, చట్టపరంగా చర్యలు తీసుకొనబడుతాయి అని కొత్తకోట ఎస్సై మంజునాథరెడ్డి హెచ్చరించారు.



# దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రైవేటు ఆర్టీసి డ్రైవర్లు మాలో కుటుంబ సభ్యులు**

**విధులకు ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవు : గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ**

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 25(ప్రభాత ఉదయం)గద్వాల ఆర్టీసి ప్రైవేట్ డ్రైవర్ రఫి పై యువకుల దాడిని నిరసిస్తు సోమవారం గద్వాల ఆర్టీసి డిపోలో హైర్ బస్సు ఓనర్స్ మరియు డ్రైవర్స్ ఆర్టీసి డీపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రైవేటు డ్రైవర్స్ కు రక్షణ కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న గద్వాల ఆర్టీసి డిపో మేనేజర్ మురళీకృష్ణ, గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ అక్కడి చేరుకుని హైర్ బస్సు ఓనర్స్ మరియు డ్రైవర్స్ తో చర్చించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎం మురళికృష్ణ మాట్లాడుతూ... విధులలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దురుసు ప్రవర్తన, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైర్ బస్సుల డ్రైవర్లు, సిబ్బంది ఆర్టీసి కుటుంబ సభ్యులే అన్నారు. ఆదివారం రాత్రి హైర్ బస్సు డ్రైవర్ పై జరిగిన దాడి ఘటనలో పోలీస్ శాఖ వారు ఫాస్ట్ గా రియాక్ట్ అయి నిందితుల మీద కేసు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన పోలీస్ వారికీ బస్సు ఓనర్స్ కు, ఉద్యోగులకు డిఎం ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులందరు మహాలక్ష్మి పథకం అమలు తర్వాత చాలా అంకిత బావముతో సేవలు చేస్తున్నారని, వారందరిని గౌరవించాలని ఎవరు కూడా అగౌరవపర్చొద్దని, దాడులకు పాల్పడడం విధులకు ఆటంకం కలిగించాలని చూస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆలయాలలో కార్తీకమాస పూజలు



గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 25(ప్రభాత ఉదయం)కార్తీకమాస మూడో సోమవారం సందర్భంగా గద్వాలలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. భీంనగర్ లోని శ్రీభీమలింగేశ్వర ఆలయం, నల్లకుంటలోని శివాలయం, సుంకులమ్మ మెట్టులోని శివాలయం, తదితర అన్ని శివాల యాల్లో పూజలు జరిగాయి. వేకువజామునే అర్చ కులు ఆలయాల్లోని మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీప కాంతులతో ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.



అధికారులు శాస్త్రవేత్తలతో సమావేశమైన హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ రాజిరెడ్డి

# పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి

**హార్టీ యూనివర్శిటీ వీసీ డాక్టర్ దండ రాజి రెడ్డి**

సిద్దిపేట (ములుగు), నవంబర్ 25(ప్రభాత ఉదయం) యూనివర్సిటీకి పరిశోధనలు వెన్నెముక అని, అందుకే రైతుల గ్రాస్ రూట్ లెవల్ సమస్యలపై శాస్త్రవేత్తలు విస్తృతంగా కృషి చేయాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా ములుగులోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ద్వైమాసిక సమావేశంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, అధికారులు, శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రైతులను ఆదుకోవడంలోనే ఉత్తమ సంతృప్తి లభిస్తుందని అధికారులతో జరిగిన సమావేశంలో వీసీ తెలిపారు. విద్యార్థుల స్టార్టప్‌లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్లు ఉద్యానవన పంటలపై అధునాతన పరిశోధనలపై దృష్టి సారించాలి. ప్రభావవంతమైన ఫలితాల కోసం శాస్త్రవేత్తలు కూడా బృందంలో పనిచేయాలని సూచించినట్లు వీసీ డాక్టర్ రాజి రెడ్డి తెలిపారు. సమావేశంలో యూనివర్సిటీ అధికారులు, అసోసియేట్ డీన్స్ పాల్గొన్నారు.



# పెద్ద చింతరేవుల ఆలయంలో టెంకాయల వేలం పాట వాయిదా

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 25(ప్రభాత ఉదయం)ధరూర్ మండలంలోని పెద్దచింతరేవులలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి గాను టెంకాయలు , కిరాణం విక్రయాలకు టూరిజం భవన అతిథి గృహ నిర్వహణ, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం పాట నిర్వహించారు. టెంకాయలు మరియు కిరాణం వస్తువుల విక్రయాలకు, టూరిజం భవన అతిథి గృహ నిర్వహణ కొరకై డిపాజిట్ దారులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఈ వేలంను వాయిదా వేసినట్లు ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ తెలిపారు. కొబ్బరి చిప్పల సేకరణకు నిర్వహించిన వేలంలో ముగ్గురు పాల్గొన్నారు. రూ. 1.20 లక్షలకు జమ్మిచేడుకు చెందిన ఎం.గోపాల్ అనే వ్యక్తి దీన్ని దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.9 వేలు మాత్రమే అధికంగా వచ్చిందని అధికారులు తెలిపారు. తదుపరి వేలం పాట ఎప్పుడు నిర్వహిస్తారో త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ప్రధాన అర్చకులు కిష్టా చార్యులు సిబ్బంది పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.